

## అమెరికా వెళ్లినా...

ఆయన పుట్టింది పెరిగింది చిన్న పల్లెటూరిలో... ఓ మధ్యతరగతి కుటుంబంలో. అచ్చ తెలుగు వాతావరణంలో.. ప్రస్తుతం స్థిరపడింది మాత్రం... అమెరికాలోని అత్యంత ఖరీదైన ప్రాంతంగా పేరున్న శాంటాబార్బరాలో.. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్న ఆదర్శానికి ప్రతిరూపంలా కనబడే ఆయన పేరు.. జమ్మలమడక శ్రీనివాసరావు. ప్రస్తుతం శాంటాబార్బరాలో ఉన్న కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం- స్టాటిస్టిక్స్ విభాగాధిపతిగా పని చేస్తున్నారు. విదేశాల్లో తాను నేర్చిన విజ్ఞానం తన సొంతగడ్డకు చెందిన యువతకు అందచేయాలన్న తపనతో సంవత్సరంలో దాదాపు సగం ఇక్కడే గడుపుతూ.. తన ప్రసంగాలు, చర్చాగోష్ఠులతో తెలుగు యువతను చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే భార్య విజయలక్ష్మితో కలిసి కాకినాడ- జేఎన్‌టీయూకి శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. -వివరాలు 9లో


# ఈనాడు
# తూర్పుగోదావరి

శనివారం 28 నవంబరు 2009 | 16 పేజీలు






శ్రీనివాసరావు, ఆయన భార్య విజయలక్ష్మి

# తెలుగువాళ్లెవరికీ తీసిపోరు..

→ అంతర్జాతీయ స్థాయిలో మనవాళ్లు రాణిస్తున్నారు.. → ప్రవాసాంధ్ర శాస్త్రవేత్త శ్రీనివాసరావు

వయోభారం, పలు ఇతర కారణాలతో అర్థంతరంగా వచ్చే అంధత్వాన్ని నివారించేందుకు అమెరికాలోని శాంటాబార్బారా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కొత్త తరహా పరిశోధనలు చేస్తున్నారు. వైద్య పరిభాషలో 'రెటీనల్ డిటాచ్‌మెంట్'(ఆర్.డి.)గా వ్యవహరించే ఒక రుగ్మతలో మనిషి కంటిలోని రెటీనా పొరలు విడిపోవటంతో సదరు వ్యక్తి అంధుడైపోతాడు. ఇలా విడిపోయి, దృష్టి కోల్పోయే వ్యక్తుల రెటీనా కణాలకు నిర్ణీత కాలావధుల్లో ఆక్సిజన్‌ను అందించడం ద్వారా మళ్లీ పూర్వపుస్థితికి తెచ్చే అవకాశముందని శాస్త్రవేత్తలు గుర్తించారు. మనిషి కళ్లల్లోని రెటీనా నిర్మాణానికి, పిల్లి కళ్లల్లోని రెటీనా నిర్మాణానికి చాలా దగ్గరి సారూప్యం ఉండటంతో ప్రస్తుతం పిల్లి కళ్లల్లోని రెటీనా పొరలపై ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. బయాలజీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, స్టాటిస్టిక్స్ తదితర విభాగాలకు చెందిన సుమారు 20 మంది శాస్త్రవేత్తల బృందం సమగ్రంగా అధ్యయనం చేస్తోంది. ఈ బృందంలో మన తెలుగువ్యక్తి సభ్యుడు కావడం మనకు గర్వకారణం. ఆయన పేరు జమ్మలమడక శ్రీనివాసరావు (ఎస్.రావు జమ్మలమడక). సాంఖ్యిక శాస్త్రవేత్త (స్టాటిస్టిషియన్) గా పనిచేస్తున్న ఆయన శుక్రవారం కాకినాడ జేఎన్‌టీయూకి వచ్చిన సందర్భంగా ఈనాడు-ఈటీవీతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

న్యూస్‌టుడే, కాకినాడ

తెలుగు విద్యార్థులు, మేధావులు ప్రపంచంలో మరెవరికీ తీసిపోరని ఆచార్య శ్రీనివాసరావు జమ్మలమడక ప్రస్తుతించారు. ఆర్థికంగా కాస్త వెనుకంజలో ఉన్నా, అగ్రదేశాలకు దీటుగా ప్రపంచ స్థాయిలో పలువురు తెలుగు తేజాలు మనజాతి గొప్పదనాన్ని చాటుతున్నారని, తెలుగువాడిగా పుట్టినందుకు ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. తన అనుభవంలో చాలా మంది అమెరికన్ విద్యార్థులకన్నా భారతీయులు, ప్రత్యేకించి తెలుగు విద్యార్థులు ఎంతో చురుగ్గా ఉండటం చూశానని వివరించారు. 'మన వాళ్ల తెలివితేటలకు తగిన ఆర్థిక స్థోమత తోడైతే.. కచ్చితంగా అద్భుతాలు సృష్టిస్తారని ఆచార్య రావు ధీమా వ్యక్తం చేశారు. ఖండాంతరాల్లో ఉన్నా, తెలుగువాళ్లు తమ సంస్కృతి సంప్రదాయాలను వదిలిపెట్టరని ఆచార్య జమ్మలమడక సతీమణి విజయలక్ష్మి చెప్పారు. 'వీలున్నప్పుడల్లా అమెరికాలోని తెలుగువాళ్లంతా ఒక చోట సమావేశమవుతుంటారు. దీపావళి, ఉగాది, దసరా వంటి పర్వదినాలన్నీ ఉత్సాహంగా, సంప్రదాయబద్ధంగా చేసుకుంటారు. సాధ్యమైనంత వరకూ ఇళ్లల్లో తెలుగులోనే మాట్లాడుకుంటారు. మనుషులం అక్కడున్నా.. మా మనసు నిండా తెలుగుద(ధ)నమే ఉంది' అని దంపతులిద్దరూ గట్టిగా నవ్వేశారు. 'ఎప్పటికైనా తెలుగు గడ్డపైనే స్థిరపడతామ'ని స్థిరంగా చెప్పారిద్దరూ.

### కుటుంబ నేపథ్యం ఇదీ..

గుంటూరు జిల్లా పొన్నూరు దగ్గర్లోని మునిపల్లెకి చెందిన ఉపాధ్యాయుడు జమ్మలమడక రామమూర్తి- సీతారామమ్మ దంపతుల ఎనిమిది మంది సంతానంలో రెండో కొడుకుగా(మొత్తం మీద ఐదో సంతానం) శ్రీనివాసరావు జన్మించారు. ఆ రోజుల్లో ఉభయ భాషా ప్రవీణగా విద్యావేత్తగా పేరున్న తండ్రి రామమూర్తిగారే శ్రీనివాసరావుకు ప్రథమ గురువు. అనంతరం బాపట్ల, గుంటూరు, చీరాల తదితర ప్రాంతాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, పీయూసీ కోర్సులు పూర్తి చేశారు. ఆపై కాకినాడ- ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్‌లో చేరాలనుకున్నా వయసు తగ్గిన కారణంగా ఆ ప్రయత్నాన్ని విరమించుకుని, కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐ.ఎస్.ఐ)లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ దశలోనే శ్రీనివాసరావు రాసిన ఒక వ్యాసాన్ని మిత్రుడొకరు అమెరికాలోని బ్లూమింగ్‌టన్- ఇండియానా విశ్వవిద్యాలయంలో జరిగిన సదస్సులో సమర్పించగా, ఆ విశ్వవిద్యాలయం అధికారులు తక్షణమే విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉద్యోగమిచ్చారు. అలా తొలిసారి అమెరికా చేరిన రావు ఆపై విస్కాన్‌సిన్ విశ్వవిద్యాలయంలో కొన్నాళ్లు పని చేసి, చివరకు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం స్టాటిస్టిటిక్స్ విభాగం వ్యవస్థాపక అధిపతిగా మారారు. ప్రస్తుతం స్టాటిస్టిక్స్‌లో ప్రపంచస్థాయి మేధావుల్లో ఒకరుగా శ్రీనివాసరావు జమ్మలమడక పేరు తెచ్చుకున్నారు. భార్య డాక్టర్ పిల్లలమర్రి విజయలక్ష్మి పర్యావరణ పరిరక్షణ రంగంలో కృషి చేస్తున్నారు.




### భవిష్యత్తు బయోఇన్ఫర్మాటిక్స్‌దే..

వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలల్లో శాస్త్ర, సాంకేతిక అంశాల సదస్సుల్లో పాల్గొనేందుకు సతీసమేతంగా రాష్ట్రానికి వచ్చిన ఆచార్య ఎస్.ఆర్. జమ్మలమడక కాకినాడ- జేఎన్‌టీయూలో 'ఈనాడు-ఈటీవీ' ప్రతినిధులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఒకప్పుడు ఏవైనా జబ్బులకు తగిన మందుల్ని కనుగొనడం అంటే కేవలం జువాలజీ, మెడిసిన్ వంటి రంగాల్లోని వారే చేయాలని భావించేవారు. కానీ నేడు ఆ పరిస్థితి మారింది. ఇప్పుడు మధుమేహం, అల్జీమర్స్, కేన్సర్ వంటి జబ్బులకి సరైన చికిత్సపై విభిన్న రంగాలకు చెందిన పరిశోధకులు, శాస్త్రవేత్తల బృందాలు ఏకకాలంలో కలిసి పని చేస్తున్నాయి. దీని వల్ల చాలా కొద్ది సమయంలో చక్కటి ఫలితాలు వచ్చే అవకాశముంది. భవిష్యత్తులో బయాలజీ, ఎలక్ట్రానిక్స్, బయోకెమిస్ట్రీ, న్యూరో సైన్స్, కంప్యూటర్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి రంగాలన్నీ సమ్మిళతమై పరిశోధనలు కొనసాగిస్తున్న 'బయోఇన్ఫర్మేటిక్స్' తరహా పరిశోధనలు ఊపందుకోనున్నాయి' అన్నారు. ఆర్.డి. పరిశోధనలు పూర్తిస్థాయిలో విజయవంతమై, సామాన్య ప్రజలకు ఉపయోగపడేందుకు మరో మూడునాలుగేళ్లు పట్టవచ్చన్నారు. తమ పరిశోధన బృందమే క్యాన్సర్ వ్యాధి నిర్మూలన, అల్జీమర్స్ వ్యాధి నివారణ అంశాలకు సంబంధించి మరో కీలకమైన పరిశోధన నిర్వహిస్తోందన్నారు. మనిషి శరీర కణాల్లోని 'మైక్రోట్యూబ్యూల్' అనే కణాంగం కదలికల్ని నియంత్రించటం ద్వారా క్యాన్సర్, అల్జీమర్స్ వంటి వ్యాధుల్ని నయం చేయవచ్చన్న అంశంపై చేపట్టిన పరిశోధనలు గణనీయమైన ప్రగతి సాధించాయని, తాము చేస్తున్న పరిశోధనలు సరైన దిశలోనే సాగుతున్నట్లు సాంఖ్యక శాస్త్ర పరంగా రుజువైందని, త్వరలోనే ఈ పరిశోధన ఫలితాలు వైద్యరంగంలో పెను విప్లవం తెస్తాయని ఆచార్య శ్రీనివాసరావు ఆశాభావం వెలిబుచ్చారు. మన దేశంలో పరిశోధనల రంగానికి అనువైన వాతావరణం అంతగా లేదని, ఈ విషయంలో మరింత మెరుగవ్వాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా మరో దశాబ్దంలో భారత్ అగ్ర దేశాల సరసన చేరే అవకాశాలున్నాయని ఆచార్య శ్రీనివాసరావు విశ్లేషించారు.